మరమ్మతుల పేరుతో నిబంధనలకు తూట్లు


భీమవరం రోడ్డులో కంకరతో ఇలా..


పూరిమెట్ల-భీమవరం మధ్యలో లేచిపోయిన రోడ్డు

ముండ్లమూరు (దర్శి): ఇటీవల కాలంలో రోడ్లకు మరమ్మతుల పేరుతో ముండ్లమూరు మండలంలో పూరిమెట్ల నుంచి భీమవరం వరకు నాలుగు కిలోమీటర్లకు ఎర్త్ వర్క్ కింద రూ.8 లక్షలు ఖర్చు చేశారు. గుంతలమయమైన రోడ్ల స్థానంలో కొత్త రోడ్లు వేయాల్సి ఉండగా కూటమి ప్రభుత్వం మసి బూసి మారేడు కాయ చేసేందుకు ప్రయత్నిస్తోంది. టెండర్లు దక్కించుకున్న అధికార పార్టీ నాయకులు రోడ్లు ఎలా వేసినా తమను అడిగేదెవరనుకున్నారేమో కానీ వేసి నెల కాకముందే అతుకులు మళ్లీ లేచిపోతున్నాయి. రోడ్లపై గుంతలు పూడ్చి వేయకుండా తూతూమంత్రంగా తారు కంకర కలిపి పోసి మమ అనిపిస్తున్నారు. ఆ తారు పోసిన చోట ట్రాక్టర్లు, ఇతర వాహనాలు నడుస్తుంటే రోడ్డు మళ్లీ మరమ్మతులకు గురవుతోంది. గుంతలు పూడ్చి కనీసం నెల రోజులు కూడా కాకుండానే మళ్లీ గుంతలు పడటంపై ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకుని మళ్లీ మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై ఆర్‌అండ్‌బీ ఏఈ రఫీని వివరణ కోరగా రోడ్డు చాలా బాగుందని సమాధానం ఇవ్వడం కొసమెరుపు.

క్రీడలతో మానసిక ఉల్లాసం


షటిల్ ఆడుతున్న ఎమ్మెల్యే బూచేపల్లి

దర్శి: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. కౌన్సిలర్ మేడం మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన షటిల్ ఇండోర్ కోర్టును ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా షటిల్ ఆట ఆడి క్రీడాకారులు, నాయకులు, కార్యకర్తలను ఉత్సాహ పరిచారు. శివప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ క్రీడల్లో చిన్న పెద్ద తేడా లేకుండా అందరూ కలిసి మెలిసి ఆడుకోవడం ఆనందంగా ఉందన్నారు. మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ మాజీ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు కేసరి రాంభూపాల్‌రెడ్డి, ఎంపీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు బండి గోపాల్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ కేవీరెడ్డి, మాజీ ఎంపీపీ ఇత్తడి దేవదానం, వైఎస్సార్ సీపీ నాయకులు కేసరి ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

నీరు నిల్వ లేకుండా చూడాలి

పెద్దదోర్నాల: మండల పరిధిలోని మోట్ల మల్లికార్జునపురంలో శుక్రవారం డ్రై డే నిర్వహించారు. సబ్ యూనిట్ అధికారి రమేష్‌బాబు మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దీర్ఘకాలంగా నీరు నిల్వ ఉంటే మలేరియా, టైఫాయిడ్, డెంగీ, చికున్ గున్యా తదితర వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. టైర్లు, కొబ్బరి బోండాలు, ఫ్రిజ్‌లు, పూల కుండీల్లో నీరు నిల్వ ఉంచకుండా ప్రతి శుక్రవారం వాటిలో నీటిని పారబోసి ఆరబెట్టుకోవాలని సూచించారు. మలేరియా సూపర్‌వైజర్ ఇజ్రాయేల్, కొర్రప్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజర్ రాఘువేంద్రరావు, ఏఎన్‌ఎం మూగెమ్మ, ఆశా వర్కర్ లక్ష్మీదేవి పాల్గొన్నారు.

శుభకార్యానికి హాజరైన బూచేపల్లి


గృహ ప్రవేశ వేడుకలో బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, వెంకాయమ్మ

తాళ్లూరు: మండలంలోని శివరాంపురం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఉప్పుటూరి బ్రహ్మయ్య నూతన గృహ ప్రవేశానికి ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మలు హాజరై బ్రహ్మయ్య కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబ సభ్యులు బూచేపల్లికి ఘన స్వాగతం పలికారు. అనంతరం అదే గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఆలోకం హరిబాబు కుమారుని పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మాజీ ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుబ్బారెడ్డి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు దేవదానం, సర్పంచ్‌లు మారం ఇంద్రసేనారెడ్డి, సుబ్బారావు, రాములు, ఎంపీటీసీలు యోహాను, ప్రభుదాసు, గుంటి గంగమ్మ దేవస్థానం మాజీ చైర్మన్ శ్రీనివాసరావు, గొల్లపాటి మోషే, జయరాంరెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, యోగిరెడ్డి, హరిబాబు, విష్ణు, సాయి చరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

కురిచేడు (దొనకొండ): మండలంలోని గంగదొనకొండ గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు గంగుల తిరుపతిరెడ్డి కుమార్తె పూజితరెడ్డి పుష్పాలంకరణ శుభకార్యానికి దర్శి ఎమ్మెల్యే, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి శుక్రవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా పూజితరెడ్డికి అక్షతలు వేసి దీవించారు. ఆయన వెంట జెడ్పీటీసీ నుసుం నాగిరెడ్డి, నుసుం ప్రతాపరెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కండె గురవయ్య, కర్నాటి చిన్న వెంకటసుబ్బారెడ్డి, అందె సుబ్బారెడ్డి, గంగుల కృష్ణారెడ్డి, చెన్నారెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి


బూచేపల్లిని సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

దర్శి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో జిల్లా పదవులు కేటాయించిన వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డికి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మకు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని కలిసి ఘనంగా సత్కరించారు. శివప్రసాద్‌రెడ్డిని సత్కరించి అభినందనలు తెలిపిన వారిలో జిల్లా ఉపాధ్యక్షుడు కొత్త మారం వెంకటేశ్వరరెడ్డి, జిల్లా ట్రెజరర్ ఎదురు కోటిరెడ్డి, జనరల్ సెక్రటరీ సూదిదేవర అంజయ్య, జిల్లా అఫిషియల్ స్పోక్ పర్సన్ జి.లింగారెడ్డి, జిల్లా యాక్టివిటీ సెక్రటరీలు బత్తుల సుబ్బయ్య, మారం ఇంద్రసేనారెడ్డి, ఆర్గనైజేషన్ సెక్రటరీలు కొరివి ముసలయ్య, ఇత్తడి దేవదానం ఉన్నారు. తమపై నమ్మకం ఉంచి పదవులు ఇచ్చినందుకు శక్తి వంచన లేకుండా పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని పదవులు పొందిన నాయకులు చెప్పారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలి


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్

దొనకొండ: చక్కగా చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదిగేందుకు విద్యార్థులు కృషి చేయాలని ప్రిన్సిపాల్ కె.ధనుమణి తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల 42వ వార్షికోత్సవం కరస్పాండెంట్ మాడిశెట్టి ప్రకాశరావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్‌ను ఇంటర్ నిర్ణయిస్తుందని, చెడు అలవాట్లకు లోను కాకుండా జాగ్రత్తగా చదువుకుని సమాజానికి, కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తెచ్చి పెట్టాలన్నారు. ఇంటర్‌లో మంచి మార్కులు తెచ్చుకున్న మొదటి ముగ్గురు విద్యార్థులకు ప్రిన్సిపాల్ బహుమతులు అందజేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అధ్యాపకులు షేక్ ఖాదర్‌వలి, దేవసుందర్, మహాలక్ష్మి, బ్రహ్మం, ఆశీర్వాదం, నాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ జిల్లా నాయకులకు అభినందనలు


ఓ.మూర్తిరెడ్డి


కె.ఓబులరెడ్డి


సింగా ప్రసాద్

యర్రగొండపాలెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం జిల్లా నాయకుల జాబితాను విడుదల చేసింది. అందులో నియోజకవర్గ నుంచి ఏడుగురు నాయకులు ఎంపికయ్యారు. యర్రగొండపాలెం పట్టణానికి చెందిన ఒంగోలు మూర్తిరెడ్డి రెండో పర్యాయం వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా, మండల పార్టీ అధ్యక్షుడిగా సేవలు అందిస్తున్న కొప్పర్తి చిన్న ఓబులరెడ్డికి జిల్లా జనరల్ సెక్రటరీగా, దళిత సంఘాలకు చెందిన సింగా ప్రసాద్‌కు యాక్టివిటీ సెక్రటరీగా నియమించారు. నియమితులైన వారు జగనన్నతో పాటు ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తమపై నమ్మకం ఉంచి పదవులు కేటాయించిన వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ అభివృద్ధికి తమ శాయశక్తులా కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. వీరికి యర్రగొండపాలెం నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు కృతజ్ఞతలు తెలిపారు.

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు


మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజమ్మ

పెద్దారవీడు: బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజమ్మ హెచ్చరించారు. మండల కేంద్రం పెద్దారవీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్పంచ్ దుగ్గెం చెన్నమ్మ అధ్యక్షతన శుక్రవారం బంగారు బాల్యం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల నిరోధక చట్టం ప్రకారం బాల్య వివాహాలకు సహకరిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. బాల్య వివాహాలతో జరిగే అనర్థాలు, మంచి చెడు సమస్యల గురించి వివరంగా తెలియజేశారు. బడి మానేసిన పిల్లలను బడిలో చేర్పించాలని, కిశోర్ బాలికలను గుర్తించి వారి ఆరోగ్యంపై అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో డ్రాపౌట్స్ పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులతో మాట్లాడి బడిలో చేర్పించాలని సూచించారు. అనంతరం పంచాయతీ స్థాయిలో బంగారు బాల్యం కమిటీ ఏర్పాటు చేశారు. పంచాయతీ కార్యదర్శి శిరీష, మహిళా పోలీసు భారతి, కార్యకర్తలు దుర్గారాణి, నాగమ్మ, ఉపాధ్యాయులు, బాల బాలికలు పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం


అలంకరణలో పోతులూరి వీరబ్రహ్మేంద్రుల వారు

కురిచేడు (దొనకొండ): కురిచేడులోని దర్శి రోడ్డులో వెలసిన శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయ ప్రథమ వార్షికోత్సవం శుక్రవారం భక్తులు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి మూలమూర్తులకు పంచామృత అభిషేకాలు, మండపారాధన, పలు రకాల విశేష పూజలు చేశారు. అనంతరం గణపతి హోమం, మూల మూర్తుల హోమం, నవగ్రహ హోమం, ఇతర హోమాలు నిర్వహించి పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. ధర్మకర్త పరబ్రహ్మాచారి దంపతులు ఆలయ కమిటీ నిర్వాహక అధ్యక్షుడు కసుమల కాలవ కొండలు దంపతులు, పోలేపల్లి లక్ష్మీనారాయణ దంపతులు, బంగారు వీరబ్రహ్మాచారి, కృష్ణపాటి వెంకటరత్నం, వీరబ్రహ్మగోపి, అల్లూరి ఆచారి కోటిలింగాచారి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రమాబాయికి ఘన నివాళి


రమాబాయికి నివాళులర్పిస్తున్న ఉద్యోగులు

దర్శి: మండలంలోని తూర్పు వీరాయపాలెం పాఠశాలలో భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ సతీమణి రమాబాయి జయంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సోషల్ ఉపాధ్యాయుడు అట్లూరి రామారావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఎఫ్‌ఏ-3 పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందించారు. అనంతరం అందరికీ మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు వి.రవిబాబు మాట్లాడుతూ పురుషుడు సమాజ నిర్మాణంలో ప్రథమ వ్యక్తిగా ఎదగాలంటే తల్లిదండ్రుల కన్నా భార్య ప్రోత్సాహం ముఖ్యమని చెప్పారు. అదేవిధంగా ప్రపంచంలో గొప్ప మేధావిగా కీర్తింపబడుతున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వెనుక భార్య రమాబాయి ఉన్నారని పేర్కొన్నారు. ఆమె త్యాగనిరతిని కొనియాడారు. ఉపాధ్యాయులు ఐ. వెంకటేశ్వర్లు, సీహెచ్ ఆంజనేయులు, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చెంచులకు మౌలిక సదుపాయాలు కల్పించాలి



గూడెం వాసులతో మాట్లాడుతున్న సీతారామన్నదొర

పెద్దదోర్నాల: చెంచు, ఆదివాసీలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని జాతీయ ఆదివాసీ సంరక్షణ సమితి అధ్యక్షుడు కారం సీతారామన్నదొర డిమాండ్ చేశారు. మండల పరిధిలోని చేమ గిరిజన ప్రాంతంలో శుక్రవారం పర్యటించిన ఆయన మాట్లాడుతూ చీకటి బతుకులు బతుకుతున్న ఆదివాసీ చెంచు గిరిజన ప్రాంతాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. దీంతో పాటు గిరిజన ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పాఠశాలలను ఆధునికీకరించాలని కోరారు. చాలా వరకు గిరిజన గూడేలకు రహదారులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. చెంచు గిరిజనులు సేకరించిన అటవీ ఫలసాయాన్ని అమ్ముకోకుండా అటవీశాఖ అడ్డుపడుతున్నారని ఆరోపించారు. ఆదివాసీ సంరక్షణ నాయకులు కారం గంగాధర్, కాక శివశంకర్ ప్రసాద్‌తో పాటు గూడెం వాసులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ

దర్శి: స్థానిక ఏఎస్‌డబ్ల్యూ పరిధిలోని 11 సాంఘిక సంక్షేమ హాస్టళ్లకు సంబంధించి ఒక్కో హాస్టల్‌కు 11 రకాల క్రీడా సామగ్రి శుక్రవారం అందజేశారు. ప్రతి వసతి గృహానికి టెన్నికాయిట్ రింగ్స్-10, క్యారం బోర్డులు-2, చెస్ బోర్డులు-5, షటిల్ కాక్‌లు-4, షటిల్ బ్యాట్‌లు-4, షటిల్ నెట్‌లు-2, స్కిప్పింగ్ రోప్, వాలీబాల్లు-2, వాలీబాల్ నెట్, త్రో పీవీసీ విత్ రింగ్, ఫుట్‌బాల్లు అందజేశారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా నైపుణ్యం సాధించాలని ఏఎస్‌డబ్ల్యూఓ ఎస్‌కే రాబియాబేగం, వార్డెన్ రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు.

డంపింగ్ యార్డును తలపిస్తున్న వాగు


చెత్తాచెదారంతో నిండి ఉన్న వాగు

తాళ్లూరు: మండలంలోని నాగబొట్లపాలెం, తూర్పుగంగవరం ప్రధాన రహదారి మార్గాన వాయుల వాగు బ్రిడ్జి డంపింగ్ యార్డును తలపిస్తోంది. గ్రామంలోని చెత్తాచెదారాన్ని, కోళ్ల వ్యర్థాలను వాగులోనే వేస్తున్నారు. ఆ మార్గంలో ప్రయాణించే వాహనదారులు దుర్వాసనతో అల్లాడిపోతున్నారు. చెత్తాచెదారం నీరు ప్రవహించే వాగులో వేయడంతో నీరు కలుషితమవుతోందని, కలుషితమైన నీటిని వ్యవసాయానికి, పాడిజీవులు తాగేందుకు ఉపయోగిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. వాగు సమీప ప్రాంతంలోని సచివాలయం ఉంది. అధికారులు అదే ప్రాంతం నుంచి ప్రయాణం చేస్తున్నా పట్టించుకోవట్లేదని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా చెత్తాచెదారన్ని తొలగించి నీరు కలుషితం కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

నేటి నుంచి నరసింహస్వామి తిరునాళ్ల

పెద్దారవీడు: మండలంలోని తోకపల్లిలో వెలసిన సద్గురు యోగానంద నరసింహస్వామి తిరునాళ్ల శని, ఆదివారాలు వైభవంగా నిర్వహించనున్నట్లు గ్రామస్తులు శుక్రవారం తెలిపారు. స్వామి వారికి తెల్లవారు జామున పంచామృతాభిషేకం, అలంకరణ, మంత్రపుష్ప నీరాజనం, ప్రసాద వినియోగం తదితర పూజలు, ఆలయం వద్ద ఉదయం 7 గంటలకు రాష్ట్రస్థాయి సీనియర్ విభాగంలో ఒంగోలు జాతి ఎడ్లబల ప్రదర్శన, మధ్యాహ్నం 12 గంటలకు అన్నదానం, సాయంత్రం భారత కోలాటం, రాత్రికి యోగానంద కళా నాట్య మండలి వారిచే భక్తప్రహ్లాద నాటకం, ఆదివారం ఉదయం స్వామి వారికి అభిషేకం, వివిధ పూజలు, మధ్యాహ్నం అన్నదానం, మధ్యాహ్నం 3 గంటలకు మోటార్ సైకిల్ స్లో పోటీలు, సాయంత్రం 4 గంటలకు కంభం శ్వేత కోలాట బృందం వారిచే భారత కోలాటం నిర్వహిస్తారని పేర్కొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చోరీ

పెద్దారవీడు: మండల పరిధిలోని మద్దలకట్ట గ్రామానికి చెందిన పోతిరెడ్డి చిన్నక్క పొలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను దొంగలు గురువారం అర్ధరాత్రి చోరీ చేశారు. శుక్రవారం ఉదయం చిన్నక్క పొలం పనులకు వెళ్లగా దిమ్మెపై ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ కనిపించలేదు. దగ్గరకు వెళ్లి చూడగా ట్రాన్స్‌ఫార్మర్ పగులకొట్టి పరికరాలు చెల్లచెదురుగా పడి ఉన్నాయి.

అందులో ఉన్న రాగి తీగలు తీసుకెళ్లినట్లు గుర్తించారు. ట్రాన్స్‌ఫార్మర్ విలువ దాదాపు రూ.లక్ష ఉంటుందని బాధితులు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలోని రైతులు పోతిరెడ్డి చిన్నక్క, దొడ్డ పెద్దవెంకటసుబ్బారెడ్డిల పొలంలో మిరప, పొగాకు, కంది పంటలు సాగు చేశారు. విద్యుత్‌శాఖ, పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. అధికారులు స్పందించి సాగు చేసిన పంటలు ఎండు ముఖం పడక ముందే ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కురిచేడు (దొనకొండ): కురిచేడు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాలకు శనివారం ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు విద్యుత్ ఏఈ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కోసం విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు చెప్పారు. గ్రామాల్లోని రైతులు ఈ సమాచారం గమనించాలని ఏఈ కోరారు.